వ్యాస కౌముది



# పండిత, పామరుల చెవులూరించిన వయోలిన్ విద్వాంసుడు, ఆదర్శగురువు 'సంగీతానంద' శ్రీ నేతి శ్రీరామశర్మ

- యనమండ్ర వెంకట కృష్ణయ్య

వ్యవస్థాపకుడు : అన్నమయ్య పరివారము, హైదరాబాద్



శ్రీ నేతి శ్రీరామశర్మ గారు కళలకు కాణాచియైన తెనాలికి దగ్గరలో వల్లభాపురం గ్రామమునందలి నూతక్కిలో 1928 నవంబర్ 14వ తేదీన సంగీత కుటుంబములో 'హరికథా కేసరి' 'హరికథా ప్రవీణ' శ్రీ నేతి లక్ష్మీనారాయణ భాగవతులు, శ్రీమతి సీతారామమ్మ దంపతుల పుణ్యఫలంగా జన్మించారు. తండ్రి నేతి లక్ష్మీనారాయణ భాగవతార్ ఆంధ్ర రాష్ట్రములో అగ్రశ్రేణి హరికథకులు, 'హరికథా పితామహ' శ్రీమద్దజాడ ఆదిభట్ల నారాయణదాసు గారి ప్రత్యక్ష మరియు ప్రియశిష్యులేగాక స్మార్తం, వేదపఠనంతో పాటుగా 'గాయక సార్వభౌమ' శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి వద్ద సంగీతమును అభ్యసించిన మహనీయమూర్తి. అమ్మమ్మగారి ఇంట జన్మించిన శ్రీరామశర్మ బాల్యం వీరి స్వగ్రామమైన నూతక్కిలోనే గడిచింది. అయితే పిల్లల చదువు నిమిత్తం వీరి కుటుంబము

విజయవాడ పట్టణమునకు తరలివచ్చి అక్కడ స్థిరపడింది.

అలనాటి ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, నేతి శ్రీరామశర్మ ఆరవ తరగతిలో సహాధ్యాయులు. అప్పటికే సంగీత కచేరీలలో తన సంగీత పాటవాన్ని శ్రీ బాలమురళీకృష్ణ ప్రదర్శిస్తూ ప్రపంచాన్ని ఆకర్షిస్తూ ఉండేవారు. కానీ, శ్రీరామశర్మకు మాత్రం స్నేహం వ్యసనంగా పరిణమించి చదువుకు దూరంగా చేసింది. స్కూల్ ఎగగొట్టి మిత్రులతో తిరగడం, కోతికొమ్మచ్చులు, గోళీలాటలతో కాలక్షేపం చేయడం వంటివి అలవాటైపోయింది. తండ్రి మందలించినా ఫలితం లేకపోయింది. దాంతో ఆరవ తరగతిలోనే శ్రీరామశర్మ చదువు ఆగిపోయింది. ఎలా బ్రతుకుతావురా అని తండ్రి కోపంగా అడిగితే ప్రశ్నకు తడుముకోకుండా 'సంగీతం పాఠాలు' చెప్పుకొని బ్రతుకుతా అని రకీమని సమాధానము చెప్పారు శ్రీరామశర్మ. సరే కదా అని 'గాయక సార్వభౌమ' శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి వద్ద సంగీతాభ్యాసానికి తండ్రి కుదిర్చారు. కానీ అక్కడ అదే తంతు – ఒకరోజు పాఠానికి వెడితే రెండు రోజులు ఎగ్గొట్టడం. ఎంతోమందికి సంగీత విద్యాదానం చేసిన పారుపల్లి వారు తమ శిష్యులందరికీ గాత్రంతో పాటు వాయులీనము కూడా నేర్పేవారు. ఒకవేళ గొంతు మూగదైపోతే, శిష్యులకు వయోలిన్ జీవనోపాధి నిస్తుంది అని పారుపల్లి వారి ముందుచూపు. శ్రీరామశర్మకు కూడా వయోలిన్ పాఠాలు మొదలుపెట్టారు. అంతే అప్పటిదాకా పాఠాలు పట్టించుకోకుండా తిరిగిన శ్రీరామశర్మ సంగీత ప్రక్రియకు దాసోహమయ్యి వయోలిన్ గాంధర్వానికి మంత్రముగ్దులై అభ్యసించడం ఆరంభించారు. గురుకుల సంప్రదాయములో పారుపల్లి వారి ఇంట నిత్యం ఎందరో శిష్యులు బసచేసి సంగీతం నేర్చుకుంటూ ఉండేవారు. అన్న పానీయములు పట్టించుకోకుండా రోజంతా శిష్యులకు విద్యాదానం చేసేవారు ఆ మహాగురువు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారు. అటువంటి గురువుల శిక్షణలో శ్రీరామశర్మ కూడా ఒక సంగీత జ్ఞానిగా అభివృద్ధి చెందారు. తదనంతరం వీరు కొంతకాలము శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి వద్ద కూడా సంగీతం అభ్యసించారు.



1947లో వివాహమై శ్రీమతి కామేశ్వరి వీరి జీవితంలోకి వచ్చాక 'స్వరాల శర్మ' ఇంట వరాల పంట పండింది. అప్పటివరకు కొద్దిమందికి సంగీత పాఠాలు చెపుతూ సంగీత కచేరీలలో పాల్గొంటూ వస్తున్న శ్రీరామశర్మకు శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ చొరవతో 1958లో హైదరాబాదు ఆకాశవాణిలో

స్టాఫ్ ఆర్టిస్టుగా ఉద్యోగం వచ్చింది. అప్పటి రేడియో స్టేషన్ డైరెక్టరుతో పిచ్చాపాటి మాటల్లో వయొలిన్ పోస్ట్ ఖాళీగా ఉందని తెలుసుకున్న శ్రీ బాలమురళీకృష్ణ ఆ పోస్ట్ కు శ్రీరామశర్మ పేరును సూచించటం, వారము తిరగకుండానే పోస్టింగ్ ఉత్తర్వులు శర్మగారికి అందుట, ఉద్యోగంలో చేరి కుటుంబాన్ని హైదరాబాదుకు తరలించటం జరిగింది. నాటి నుండి సంగీత ప్రపంచంలో శ్రీరామశర్మ జైత్రయాత్ర ప్రారంభమైనది. సర్వశ్రీ టి. ఆర్. మహాలింగం, ఎస్. రామనాథన్, డి. కె. పట్టమ్మాళ్, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎమ్. ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ, నేదునూరి కృష్ణమూర్తి, శ్రీరంగం గోపాలరత్నం, నూకల చిన సత్యనారాయణ, టి. టి. సీత, మాలతీ పద్మనాభరావు, యు. శ్రీనివాస్ (మాండలిన్) వంటి ఎంతోమంది ప్రముఖ సంగీత విద్వాంసులకు కచేరీలలో ఆకాశవాణి నిలయ విద్వాంసుడిగా తమ వయొలిన్ సహకారాన్ని అందించి అటు ఆకాశవాణిని ఇటు మన కళా సాంస్కృతిక వారసత్వ సంపదను జిగేల్మని మెరిపించారు శ్రీరామశర్మ. ఆకాశవాణిలో వయొలిన్ నిలయ విద్వాంసులుగా కొనసాగుతుండటంతో వయొలిన్ కళాకారుడిగానే ప్రజా బాహుళ్యంలో ఎక్కువగా రాణించారు. అయితే అయన 'గాత్రం' కూడా అంతే ఘనమైనది, విశిష్టమైనదన్న సంగతి చాలామందికి తెలియదు.

వీరు ఆకాశవాణి జాతీయ సమ్మేళనములలో తమ ప్రతిభను ప్రదర్శించుటతో పాటు దేశములోని అన్ని ప్రధాన నగరములలో ప్రతిష్ఠాత్మకమైన సంగీత సభల కచేరీలలో ప్రదర్శనలిచ్చారు. సుప్రసిద్ధ మ్యూజిక్ అకాడమీ, ఇండియన్ ఫైన్ ఆర్ట్స్, తమిళ ఇసై సంఘం వంటి ఎన్నో సభలలో వాయులీన కచేరీలతో పాటుగా గాత్ర కచేరీలు కూడా చేసి రసజ్ఞులైన శ్రోతల ప్రశంసలు పొందారు. తనతోపాటు పారుపల్లి వారివద్ద సహాధ్యాయి అయిన ముసునూరి వెంకట రమణమూర్తితో కలసి అనేక సభలలో గాత్రయుగళ కచేరీలు చేసి పేరుప్రఖ్యాతులు గడించారు.



సంగీతంలో కొద్దో గొప్పో జ్ఞానం ఉండి, పాఠాలు నేర్పించి ధనము గడిస్తున్నటువంటి రోజులలో ఆ సంగీతం పట్ల గౌరవంతోను, తమ గురువుగారి భోధనా పద్ధతిని స్మరించుకుంటూ సంగీత విద్యను కేవలము నామమాత్రపు ఫీజుకే బోధించేవారు శ్రీరామశర్మ. గాత్ర సౌలభ్యం ఉండి కుటుంబ పరిస్థితులు బాగాలేని విద్యార్థులకు కూడా ఉచితంగా పాఠాలు నేర్పటమే కాకుండా బీద విద్యార్థులకు,

అర్హులకు గుప్తదానాలు చేసిన మహనీయులు, దయార్ద్ర మనస్కులు కూడా వీరు. స్వర జ్ఞానాన్ని, గమకాలను, రాగాలను అతి సులభంగా గ్రహించే వీలుగా సరళమైన పద్ధతిలో బోధించడం శర్మగారి ప్రత్యేకత. వాక్చాతుర్యంతో, చమత్కారంతో అందరినీ ఆకట్టుకునే వ్యక్తియని, మంచికి మారుపేరుగా నిలిచిన మహామనిషి అని డాక్టర్ బాలమురళీకృష్ణ గారు కొనియాడేవారు.

సర్వశ్రీ లాల్గుడి జి. జయరామన్, ఎమ్. ఎస్. గోపాలకృష్ణన్, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎన్. రమణి, శ్రీరంగం గోపాలరత్నం వంటి వారి సంగీతాన్ని వీరు ఎక్కువగా అభిమానించేవారు. గతకాలపు సుస్వరానికీ, సంగీత కళావైభవానికీ ఆనవాళ్ళుగా నిలిచిన అతికొద్దిమంది విద్వాంసులలో వీరు ఒకరు అనడంలో సందేహము లేదు. వీరు ఎన్నో వాయులీన సోలో కచేరీలతో పాటు, సుప్రసిద్ధ వాయులీన విద్వాంసులు మారెళ్ల కేశవరావు గారి వయోలిన్ సోలో ప్రోగ్రామ్స్ కి చక్కని సహకారం అందించడంతోపాటు, క్లిష్టమైన రాగం తానం పల్లవి పాడే సుసర్ల శివరాం గారికే కాకుండా ఫ్లూట్ విద్వాంసులు టి. ఆర్. మహాలింగం గారికి కూడా వయోలిన్ పై సమర్ధవంతంగా, ధీటుగా సహకారం అందించేవారు.

సంగీత విజ్ఞానఖనిగా పేరు పొందిన శ్రీరామశర్మ సంగీత ప్రయాణంలో కొన్ని ముఖ్య ఘట్టములు :



1) సుమారు 1970 సంవత్సరము ప్రాంతములో హైదరాబాద్ రవీంద్రభారతి లో రేడియో సంగీత సమ్మేళనం కార్యక్రమములు జరుగుతున్న రోజులు అవి. ప్రముఖ వేణు విద్వాంసులు శ్రీ టి. ఆర్. మహాలింగం గారు వేణు వాద్యములో మేరు పర్వతం లాంటివారు. వారిని సన్నిహితులు 'మాలి' అని పిలుస్తూ ఉండేవారు. మహాలింగం గారి కచేరీ కూడా ఏర్పాటయింది. మృదంగ వాద్యంలో దిగ్గజంలాంటి పాలఘాట్ మణి అయ్యర్ గారు మృదంగ సహకారం. కచేరీ ప్రారంభ సమయానికి అకస్మాత్తుగా వయోలిన్ విద్వాంసురాలు అస్వస్థతకు గురై రాని సమయంలో కార్యక్రమ నిర్వహణ బాధ్యతలో ఉన్న శ్రీ ఎన్. ఎస్. శ్రీనివాసన్ గారు కంగారులో ఉన్న సమయములో శ్రీరామశర్మ గారు ముందుకువచ్చి

వయోలిన్ సహకారాన్ని అందచేసి ఆ రోజు కార్యక్రమాన్ని గట్టెక్కిచ్చారు. శర్మగారు అందించిన వయోలిన్ సహకారాన్ని 'మాలి ' గారు ఎంతగానో మెచ్చుకున్నారట.

2) ఇంకొక పర్యాయం హైదరాబాదులోనే శ్రీ ఎస్. బాలచందర్ గారి వీణ కచేరీ ఏర్పాటు అయ్యింది. వీణా వాద్యంలో వారికి వారే సాటి. ఆనాటి కచేరీకి తాళం వెయ్యటానికి శ్రీరామశర్మ గారిని నియోగించారు. ఆ రోజుల్లో వాద్య సంగీత కచేరీలకు సాధారణముగా ఒకరు ప్రత్యేకముగా తాళం వేసేవారు కూడా వేదిక మీద ఉండేవారు. కచేరీ అయ్యాక బాలచందర్ గారు శర్మగారి లయ జ్ఞానం చాలా అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారట.

3) శ్రీ బి. ఆర్. సి. అయ్యంగార్ గారు, సంగీత గాత్ర విద్వాంసులు మరియు 'హిందూ' పత్రికలో సంగీత విశ్లేషకులు, విమర్శకులు కూడా. వారి కచేరీలకు కూడా శ్రీరామశర్మ గారు ముఖ్యముగా దక్షిణ దేశంలో అనేక ప్రాంతములలో వాయులీన సహకారాన్ని అందించారు. 'అత్యంత ఆప్తులు, స్నేహశీలి, సున్నితమైన హాస్యంతో గంటల కొద్దీ నవ్వించగల శక్తి శ్రీరామశర్మ గారికి ఉంది' అని శ్రీ అయ్యర్ గారు అంటూ ఉండేవారట.

4) శ్రీ ఎన్. ఎస్. శ్రీనివాసన్ గారు వేణు విద్వాంసులు, ' మాలి గారి' శిష్యులు, ఆకాశవాణి హైదరాబాద్ నిలయంలో సంగీత దర్శకులు, పర్యవేక్షకులు. వీరికి సంగీత విద్వాంసులంటే ఎనలేని ప్రేమ. శ్రీ శ్రీనివాసన్ గారు ఒకసారి మద్రాసులో తమ వేణు వాద్య కచేరీకి శ్రీరామశర్మ గారిని వయోలిన్ సహకారానికి తీసుకువెళ్లారు. అప్పుడు మద్రాసులో ఉన్న శ్రీనివాసన్ గారి మిత్రులు డాక్టర్ సి. చిట్టిబాబు (ప్రముఖ వీణా విద్వాంసులు) "ఇంత మంది వయోలిన్ విద్వాంసులు మద్రాసులో ఉన్నారు కదా! హైదరాబాదు నుండి తీసుకు రావడమేమిటి" అన్నారుట. అప్పుడు శ్రీనివాసన్ గారు "శ్రీరామశర్మ గారి వయోలిన్ వాద్య మత్తులో పడిపోయాను. ఇంకెవరు వాయించినా నాకు సౌకర్యంగా ఉండదు. ఆయనే వాయించాలి" అని జవాబు చెప్పారుట.

5) శ్రీ లాల్గుడి జి. జయరామన్ గారు ప్రముఖ వయోలిన్ విద్వాంసులు. వీరు శ్రీరామశర్మ గారు ఆకాశవాణిలో వాయించిన ఒక అష్టపది విని ప్రత్యేకముగా శర్మగారిని అభినందించారు.

6) ఎక్కువగా చదువలేకపోయినా, శ్రీరామశర్మ సంగీతం మాష్టారుగా పొందిన గుర్తింపు, గౌరవం అసాధారణమైనది. ప్రముఖ విశ్వవిద్యాలయాల, సంగీత కళాశాలలకు వీరు పరిశీలకుడిగా నియమింపబడ్డారు.



వయొలిన్ కన్నా, గాత్రం కన్నా వీరు ఎక్కువగా ప్రేమించేది బోధనా వృత్తి. తమ గురువులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారిలా బోధన పట్ల అంకితభావంతో నిమగ్నమైన గొప్ప గురువు శ్రీరామ శర్మ. వీరి వద్ద శిక్షణ పొంది ఆకాశవాణి పోటీలలో అవార్డులు, బహుమతులు అందుకున్న యువతీయువకులు, శిష్యగణం ఎందరో ఉన్నారు. ప్రఖ్యాత విదుషీమణి శ్రీమతి బి. ఇందిరా కామేశ్వరరావు, శ్రీమతులు వేదవతి ప్రభాకర్, నృత్య చూడామణి శోభానాయుడు, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, డాక్టర్ వై. రమాప్రభ, కె. శేషుబాయి, చిద్రూపలక్ష్మి, చంద్రభాను, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, మహాలక్ష్మి, స్వప్న, శ్వేతా ప్రసాద్, అంజనా సుధాకర్, డాక్టర్ కుప్పా శారద, ప్రత్యూష హరి, కామేశ్వరి, నిర్మల, కస్తూరి, శృతి, లావణ్య (USA), అలివేలు; శ్రీయుతులు చంద్రశేఖర్, పలకా శ్రీనివాస్ (USA ), పి. రమేష్, ఆదిత్య, రవి గణేష్, సినీ నేపథ్య గాయకులు నేమాని పార్ధసారథి, నిహాల్, వినయ్ రాహుల్ తదితరులు శ్రీరామశర్మ శిష్యగణమే.

అపారమైన శిష్య సంపద కలిగిన శ్రీరామశర్మ గారికి 2000 సంవత్సరములో హైదరాబాదు భాగ్యనగరంలో పుష్పగిరి పీఠాధిపతులైన శ్రీ శ్రీ శ్రీ నృసింహ భారతీస్వామి వారి దివ్య ఆశీస్సులతో, సంగీత శ్రేష్ఠులైన సర్వశ్రీ అన్నవరపు రామస్వామి, నూకల చిన సత్యనారాయణ, ఎల్లా వెంకటేశ్వరరావు వంటి ప్రముఖుల సమక్షంలో డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి ఆధ్వర్యంలో శ్రీరామశర్మ గారి శిష్య ప్రశిష్యులు గురువులకు చేసిన విశిష్టమైన సువర్ణఘంటా కంకణ ప్రదాన – కనకాభిషేక మహోత్సవము మరియు 'సంగీతానంద' బిరుదు ప్రదానము చరిత్రపుటల్లో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. బహుశా భాగ్యనగరంలో ఇంతకుముందు ఏ గురువులకు శిష్యులు ఇటువంటి ఘనసత్కారం జరుపలేదనటం అతిశయోక్తిగాదు.

2000 సంవత్సరములో శ్రీరామశర్మ గారికి శిష్యులు జరిపిన సువర్ణఘంటా కంకణ ప్రదాన - కనకాభిషేక మహోత్సవము మరియు తదనంతరం - శ్రీరామశర్మ గారికి సమకాలీకులైన కొంతమంది సంగీత ప్రముఖులు, శ్రేయోభిలాషులు మరియు శిష్యులు శర్మగారితో వారికున్న అనుబంధాన్ని, సాన్నిహిత్యాన్ని తెలియచేసిన ఆహ్లాదకరమైన విషయాలు కొన్నిటిని క్రింద ఉదహరించటమైనది.

శ్రీరామశర్మ సహాధ్యాయి అయిన పద్మ విభూషణ్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు శ్రీరామశర్మ గురించి ప్రస్తావిస్తూ "విశిష్టమైన వ్యక్తిత్వం గలవాడని, 60 సంవత్సరములుగా మేము కలసిమెలసి మసలుకొనుచున్నామని; శ్రీరామశర్మకి పెద్దల యందు గౌరవము, మంచిని గ్రహించుట, నిష్కళంకమైన స్నేహభావం, సహనము, తృప్తి, విలక్షణమైన మనుగడ కలిగి అందరికీ సంతోషం కల్గించుచూ ఆనందమైన జీవనము గడుపుట వంటి సలక్షణములు ఇతనిని వరించినవని; జంతగాత్రములలో ఆరితేరినవాడని, మంచి గురువుగా అనేకమందికి విద్యాబిక్షను ప్రసాదిస్తున్నవాడని; ఆకాశవాణిలో మచ్చలేని నిలయ విద్వాంసునిగా పేరు గడించినవాడని, శర్మతో గడుపు సమయం తనకెంతో హాయిని, ప్రశాంతతను, మనోల్లాసమును కలిగించేదని; అహంకారము లేదని, ఇతరులను నొప్పించేవాడు కాదని, చిరునగవు మోముతో, చమత్కారముతో మితభాషణము చేసేవాడని; మంచికి మారుపేరుగా నిలిచిన మహామనీషి అని' కొనియాడారు.

'నాదసుధార్ణవ' పద్మశ్రీ అన్నవరపు రామస్వామి గారి మాటల్లో (ఆ రోజులలో పంతులుగారి వద్ద విద్య నేర్చుకొనే అందరూ వీరిని 'అన్న రామస్వామి' అని సంబోధించే వారు) "స. ప. స. లు, అనగా మొదటి నుంచీ మా ఇద్దరి గురువర్యులైన బ్రహ్మశ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి వద్ద నేర్చుకుంటూ, మా అయ్యవారి వద్ద పాఠం చెప్పుకొని నా వద్ద సాధన చేస్తూ ఉండేవాడని; సహజమైన గాత్రం, సూక్ష్మ గ్రాహ్యత కలిగిన శ్రీరామశర్మ గురువుగారు పాఠం చెప్పగానే గ్రహించేవాడని; వయొలిన్ వాద్యం లోను మంచి దిట్టయని, ఎటువంటి క్లిష్టమైన సంగతినైనా చాలా సునాయాసముగా పాడటమే గాకుండా వయొలిన్ పై కూడా చాలా సుళువుగా పలికించేవాడని; ఆకాశవాణి నిలయ విద్వాంసునిగా డాక్టర్ బాలమురళీకృష్ణ వంటి మేధావులకు రాగం, తానం, పల్లవి ప్రోగ్రామ్స్ వాయులీన సహకారం అందించడంతో పాటు, గాత్ర కచేరీలు, సంగీత శిక్షణ .... ఒకటేమిటి అనేక రేడియో కార్యక్రమాలలో పాల్గొని ఆకాశవాణిలోనే కాక దూరదర్శన్ కార్యక్రమాలలోనూ, దేశం నలుమూలల అనేక సభలలో పాల్గొని సంగీత ప్రపంచానికి ఎనలేని పేరు ప్రతిష్టలను అందించడంతో పాటు గురువుగా అనేకమంది శిష్యులను తయారుచేసాడని; నిగర్వి, ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాడని .... ఒక్క మాటలో చెప్పాలంటే అజాతశత్రువు అని" వక్కాణించారు.

'సంగీత కళానిధి' శ్రీ నేదునూరి కృష్ణమూర్తి గారు ఒకానొక సందర్భములో శ్రీరామశర్మ గారి గురించి ప్రస్తావిస్తూ "పంచుకొన్నకొద్దీ పెరిగే ఆస్తులు విద్య, ఆనందం! నిత్యనూతనోత్సాహముతో తానుంటూ తన పరిసరాన్ని కూడా ఉత్సాహ, చైతన్యాలతో గుబాళింప చేయగలిగిన సరసహృదయుడని; ఉద్యోగ విరమణానంతరం కూడా నిర్విరామంగా సంగీత వ్యాసంగంతో పదిమందికి సంగీత జ్ఞానాన్ని పంచిపెడుతూ ఒక ఉత్తమ గురుపీఠంగా గౌరవాదులు పొందుతున్న ధన్యుడు శ్రీరామశర్మ" అని అభివర్ణించారు.

'మహామహోపాధ్యాయ' శ్రీ నూకల చిన సత్యనారాయణ గారు "శ్రీరామశర్మ గొప్ప సంగీత విద్వాంసుడని, సంప్రదాయబద్ధమైన శైలి, మంచి గాత్రం, మధురమైన పలుకుతోపాటు మంచి గాత్ర విద్వాంసుడని; వీరి పాట నేతి మిఠాయి వలే ఉండునని; అనేక సంగీత సభలలో గొప్ప విద్వాంసుల నుండి చిన్న చిన్న కళాకారుల దాకా వయోలిన్ సహకారం అనేక దశాబ్దాలు కొన్ని వందల మందికి ఎన్నో సభలలో, ప్రదేశములలో వాయించి రసికుల మన్ననలు పొందిన శ్రీరామశర్మ ఆదర్శప్రాయమైన సద్గురువని; వందలాది శిష్యులకు బోధన చేసి, మంచి విద్వాంసులుగా రూపొందిన మహామనీషియని; తన గృహం ఒక సంగీత క్షేత్రముగా చేసుకొని సంగీత వ్యవసాయాన్ని చేసి దివ్యమైన సంగీత పంటను పండించి సంగీత భోజనాన్ని సంగీత రసికులకు అందించిన సహృదయుడని; శ్రీరాముడుగా నీలమేఘచ్ఛాయతో ఆప్యాయంగా, మధురంగా మాట్లాడుతాడని; లక్ష్మి సరస్వతి వీరి ఇంట అత్తా కోడలుగా కలిసిమెలసి (లక్ష్మీ సరస్వతి సహజీవనం చేసినట్లుగా) ఉంటున్నారని; నేతివారి గృహం "ఇందిరా శారదానిలయమని" కొనియాడారు.

ప్రముఖ మార్దంగికులు పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరావు గారు శ్రీరామశర్మ గురించి ప్రస్తావిస్తూ "నా ఏడవ సంవత్సరం కచేరీ ప్రారంభం నుండి నాయందు ప్రేమానురాగాలు చూపుతుండేవారని; సౌజన్యమూర్తి ,సంగీత కళాతపస్వియని; ఒక వ్యక్తి సాధారణంగా ఒకే విద్యలో ప్రావీణ్యత కలిగియుండవచ్చని, సవ్యసాచి అనే సార్ధక నామం కలిగిన అర్జునివలె శ్రీరామశర్మ అంత్యంత ప్రతిభావంతునిగా ఖ్యాతి పొందినవారని; ఒక కళాకారుని వలన సంస్థకి, సంస్థ వలన కళాకారునికి అవినాభావ సంబంధాలతో విలసిల్లి అత్యంత కీర్తి ప్రతిష్టలు తెచ్చుకున్నారని; మేమిద్దరమూ సోదరులవలె ఆకాశవాణిలో 35 సం. లు కలసి పనిచేశామని, ఆకాశవాణిలో బాలానందం, స్త్రీల, యువజన, కార్మిక, జానపద, నాటికలు, నాటకాలు, రాగం తానం పల్లవి ఇత్యాది కార్యక్రమములలో మేమిద్దరమూ కావాలని కార్యక్రమ

నిర్దేశకులు, దర్శకులు కోరుకొనేవారని; మంచి సద్గురువుగా కీర్తిని ఆర్జించి తన జన్మను సార్థకం చేసుకొన్నారని" ప్రశంసించారు.

శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారు, సంగీత దర్శకులు, గీత రచయిత శర్మగారిని ప్రశంసిస్తూ "భగీరథుడు గంగను భూమిపైకి తీసుకువచ్చినట్లు సుసర్ల దక్షిణామూర్తిగారు దక్షిణాది నుంచి త్యాగరాజస్వామి సంగీత సంప్రదాయాన్ని కొనితెచ్చి ఆంధ్రదేశమునకు అందించగా; వారి ప్రియశిష్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారు వారి గురువుల అడుగు జాడల్లో తయారుచేసిన శిష్యులలో శ్రీరామశర్మ ఒకరని; సంగీతాన్ని అంగడిలో దొరికే వ్యాపార వస్తువుగా మార్చకుండా, లౌకిక ప్రపంచ ఆకర్షణలకు ప్రలోభాలకు లొంగిపోక, సంగీత విద్యావ్యాప్తియే జీవిత మహదాశయంగా గురుకటాక్ష బలంతో ఎంతోమంది శిష్యులను తయారుచేశారని; శర్మగారు సంపాదించుకున్న శిష్య సంపద మరే విద్వాంసుడు సంపాదించుకోలేదేమోయని" కొనియాడారు.

శ్రీ లాల్గుడి జి. జయరామన్ గారు శ్రీరామశర్మ గారిని మొదటసారి 1951లో విజయవాడలో కలుసుకొన్నారు. నాటినుండి వారిద్దరి మధ్య సాన్నిహిత్యం ఉంది. అదే సందర్భములో రైల్వే సమ్మె కారణంగా జయరామన్ గారు ఒక వారం రోజులపాటు విజయవాడలోనే బస చేయవలసి వచ్చినది. ఈ వారంరోజులు వారితో గడిపిన సమయములో "శర్మగారిలోని మంచి గుణాలు, వారి స్నేహపూర్వక స్వభావం, వినయం, చిత్తశుద్ధి మరియు సంగీతం పట్ల వారికి ఉన్న అంకితభావం వెలుగులోకి రావడమే కాకుండా మా స్నేహాన్ని మరింత దగ్గర చేసిందని" అని అన్నారు శ్రీ జయరామన్ గారు. తరువాతి కాలంలో కూడా చాలా సందర్భాలలో వారివురు ఆంధ్రాలో అనేక నగరాల్లో కలుసుకున్నప్పుడు శ్రీ జయరామన్ గారు "శర్మలో అప్పటికి ఇప్పటికి మార్పులేదని, అంతటా అలాగే ఉన్నాడని" కొనియాడారు.

శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు గారు, వాయులీన విద్వాంసులు "శ్రీరామశర్మ గాత్రము, వయోలిన్ వాయిద్యములందు అగ్రగణ్యుడని; అయన పాట పాడినా, వయోలిన్ తనిగా వాయించినా, ప్రక్క వాయిద్యముగా వాయించినా తనదంటూ ఒక ప్రత్యేకత సంతరించుకున్న మహామనీషియని; సంగీత కళను భక్తితో ఆరాధించి సంగీత కళామతల్లికి యెనలేని సేవచేసిన మహావ్యక్తి, వయోలిన్ ప్రక్క వాయిద్యముతో సహకరించినప్పుడు తన నిండు హృదయముతో పాటకులను ఉత్సాహముగా పాడించి, అటు పాటకులను, ఇటు రసికులను రంజింపగల సమర్థులని" కొనియాడారు.

'సంగీత ప్రచార సేవకారత్న' శ్రీ కె. ఎస్. ఆర్. బాలకృష్ణ శాస్త్రిగారు (అధ్యక్షులు: సప్తస్వర, హైదరాబాదు) తమ సందేశములో "శ్రీ శర్మగారు ఆకాశవాణి నిలయ విద్వాంసునిగా బాలానందం కార్యక్రమము మొదలుకొని మాములు కరాళాకారులకు, హరికథా విద్వాంసులకు, ప్రఖ్యాత విద్వాంసులు పాడే కచేరీలకు, రాగం తానం పల్లవి కార్యక్రమములకు వయోలిన్ సహకారం అందించడానికి ముందుండేవారని; కళాకారునియొక్క మనసునెఱిగి ప్రక్క వాయిద్యం వాయించడం, మంచి మనసుతో ఇతరులకు పరిచయం చేయటం వారిలో గల విజ్ఞత అని; కాలమును సద్వినియోగం చేయడం వారి నైజమని; అనేకమందికి అనేక విధములుగా సహాయంచేసిన వ్యక్తియని, సంగీతలోకంలో వారి సహాయములేని కార్యక్రమాలు ఏవీ లేవని; గురువులు పారుపల్లి వారివలెనే శిష్యవాత్సల్యంతో అనేకమంది శిష్యులకు సంగీత భిక్షపెట్టి ఆదర్శగురువులుగా పేరుపొందారని; ఛలోక్తులు చెప్తూ అందరినీ నవ్విస్తూ ఉండేవారని; కొంతమంది కాళాకారులు శర్మగారి ఛలోక్తులు ఔషధంగా సేవించి ఉత్సాహవంతులయ్యేవారని; ఉభయ తెలుగు రాష్ట్రములలోనే కాకుండా బెంగాల్ రాష్ట్రములో, దక్షిణాది రాష్ట్రములలో, కేంద్రపాలితమైన ఢిల్లీలోనూ అనేక సంగీత సభలు చేసి సన్మానాలు పొందారని; శర్మగారికి జరిగిన అఖండ సన్మానములు కొంతమంది మహానుభావులకే జరిగినాయని" తెలియచేసారు.

శ్రీ సూరి వెంకటేశ్వర్లు గారు (అధ్యక్షులు: విజ్ఞాన సమితి, హైదరాబాదు) శ్రీరామశర్మ గారిని ప్రశంసిస్తూ "వీరు కర్ణాటక సంగీతంలో ప్రముఖ విద్వాంసులందరికీ వయోలిన్ సహకారాన్ని అందించేవారని; చిన్న పెద్ద అనే తేడా లేకుండా సంగీత విద్వాంసుల యెడ గౌరవం, ప్రేమ, అభిమానం, వాత్సల్యం చూపి అందరి మన్ననలు పొందారని; ఉన్నతశ్రేణి 'ఏ గ్రేడ్' విద్వాంసుడనని గిరిగీసుకొని కూర్చోలేదని; తాను నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ హాయిగా జీవనం సాగించిన ధన్యజీవి, సద్గురువు, అజాతశత్రువు, వినయశీలి, నిగర్వి, నిరాడంబరుడు, నిష్కపటి అని సాటి కళాకారులు అంటూ ఉండేవారని; 84 ఏళ్ళ జీవితం అంతా సంగీతంలోనే ఆనందంగా గడిచిపోయిందని, అందుకే 'సంగీతానంద' బిరుదు వీరికి సార్ధకమైనదని; జంత్రగాత్ర విద్వాంసులుగా ప్రసిద్ధిపొందారని; ఆకాశవాణి హైదరాబాదు కేంద్రములో నాలుగు దశాబ్దములపాటు నిర్విరామంగా వయోలిన్, గాత్రంలో తమ బాణిని, వాణిని వినిపించారని; శర్మగారిని ఎప్పుడు కలిసినా ఉల్లాసంగా, ఉత్సాహంగా, సంతోషంగా గడిచిపోతుందని; వీరికి శిష్యులంటే ఎంత ప్రేమో ఆ శిష్యులకు గూడా గురువుగారంటే అంత భక్తి, గౌరవమని; విజ్ఞాన సమితి నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలలో వీరు ఎప్పుడూ ముఖ్య అతిధియని; ఆకాశవాణిలో వీరిని బహుముఖ ప్రజ్ఞాశాలిగా అందరూ మెచ్చుకుండేవారని; వారి సాంగత్యం మరువలేనిది, మరపురానిదని" కొనియాడారు. శ్రీ వెంకటేశ్వర్లు గారు ఒకసారి శర్మగారిని కలవటానికి 'ఆకాశవాణి' కి

వెళ్లారుట. విరామ సమయం కావటం వల్ల కాంటీన్ లో ఉన్నారని తెలిసి అక్కడకు వెళ్లారు. అప్పుడు శర్మగారు తమ మిత్రులతో కూర్చుని 'టీ' ఆర్డర్ చెపితే – 'టీ' ఇచ్చే కుర్రాడు 'షుగరు వెయ్యాలా' అని అడిగితే – శర్మగారు వెంటనే 'మా వంట్లో చాలా షుగర్ వుంది, నువ్వు వెయ్యక్కర్లేదు" అన్నారుట. అంతే! ఆ వాతావరణం అంతా నవ్వుల మయమయ్యిందని; వారి సాంగత్యం మరువలేనిది, మరపురానిదని జ్ఞప్తికి తెచ్చుకున్నారు వెంకటేశ్వర్లు గారు.

హైదరాబాద్ సిస్టర్స్ శ్రీమతి లలిత, శ్రీమతి హరిప్రియలు "శర్మగారిలో మాకు నచ్చినది ఏమిటంటే – తల్లీ, తండ్రి, గురువు జీవితములో ఎంత ముఖ్యమో, వారిని ఎంత భక్తితో భావించాలో చెపుతుండేవారని; వారు మంచి ఉపాధ్యాయులని, మేము కూడా వారి దగ్గర ఎన్నో మంచి అంశాలను ఆకళింపు చేసుకొని మా సంగీతంలో ఇముడ్చుకొని పాడుకొనేవాళ్లమని; వారు స్వతహాగా చాలా చురుకు మనిషియని, సంగీతం మీద అంకిత భావముతో ఉండేవారని, వారు ఎల్లప్పుడూ చిరస్మరణీయులని" కొనియాడారు.

శ్రీ పి. వి. రామమోహన్ నాయుడు గారు తమ సందేశములో " వీరి వద్ద తర్ఫీదు పొంది ఆకాశవాణి పోటీలలో అవార్డులు, బహుమతులు అందుకున్న యువతీయువకులు ఎందరో ఉన్నారని, బీద విద్యార్థులకు గుప్తదానాలు చేసిన మంచి మనిషియని , ఔదార్యం ప్రదర్శించవలసిన సమయాల్లో ముందుండటానికి వారు ఎప్పుడూ వెనుకాడేవారు కారని, గతకాలపు సుస్వరానికీ, సంగీత కళావైభవానికీ ఆనవాళ్లుగా నిలిచిన అతికొద్దిమందిలో ఒకరని; సంగీతమే తన ఊపిరిగా, అదొక్కటే తన మార్గంగా భావించి నడిచారని; సాధారణంగా కనిపించే ఈ అసాధారణ ప్రజ్ఞావంతుడి సేవలు తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలు వినియోగించుకుంటే మరోతరం కళాకారులను మెరికల్లా తయారుచేసే అవకాశం ఉంటుందని" కొనియాడారు.

శ్రీరామశర్మ శిష్యగణంలోని నేమాని పార్థసారథి గురువుల గురించి ప్రస్తావిస్తూ "కర్ణాటక సంగీతానికి జీవితాన్ని పూర్తిగా అంకితం చేసిన మాహానుభావులని; పారుపల్లి వారి శిష్యునిగా శ్రీ బాలమురళి, శ్రీ అన్నవరపు రామస్వామి గారి వంటి సంగీత ఘనాపాఠీల సమకాలీకునిగా వారు సంగీతానికి చేసిన సేవలు అజరామరమని, అనన్య సామాన్యమనీ; తన దగ్గర ఉన్న సంగీత కళానిధిని భావితరములవారికి అందించాలన్న సదుద్దేశ్యముతో వందలాది మంది శిష్యులకు కొన్ని దశాబ్దములపాటు వారు చేసిన విద్యాదానం మరువలేనిదని; ఆలా వారి దగ్గర శిష్యరికం చేసిన వారిలో తాను కూడా ఉండటం తన పూర్వజన్మ సుకృతమని; 'సద్గురువు' అనే పదానికి అచ్చమైన నిదర్శనం శ్రీ శర్మగారని; శ్రీమతి ఎమ్. ఎస్. సుబ్బలక్ష్మి వారివంటి సంగీత శ్రేష్ఠులకు వాయిద్య సహకారం అందిస్తూ ఎంత

ఆనందించేవారో .. గీతాలు పాడుతున్న ఒక చిన్నపిల్లవానికి వాయించడం కూడా అంతే విధముగా ఆస్వాదించేవారని, అది నేతివారి సంస్కారమని" సగర్వంగా తెలియచేసారు. అంతే కాకుండా 1992 సంవత్సరంలో ఆకాశవాణిలో లలిత సంగీతంలో తనకు జాతీయస్థాయిలో ప్రధమ బహుమతి రావటానికి, మరిన్నో రకాలుగా గుర్తింపు పొందటానికి ఆ మాహానుభావుడే కారణమనియు; శిష్యులు యువవాణి సంగీత కార్యక్రములలో పాల్గొనటానికి, ఇతర సంగీత పోటీలకు వెళ్ళటానికి గురువుగారే స్వయముగా దరఖాస్తులు నింపి, వారి మోటారు సైకిల్ మీద తీసుకెళ్లి, శిష్యులు బాగా పాడి గుర్తింపు తెచ్చుకోవడానికి దోహదపడిన మహోన్నత వ్యక్తిత్వం గురువుల సొంతమని; గురువులు పెట్టిన 'సంగీత బిక్ష' వల్ల ఇవాళ తాను సినీ సంగీత పరిశ్రమలో ఒక నేపధ్య గాయకుడిగా అందరి మన్ననలు పొందడానికి తన జీవనయానంలో ఉపయోగపడుతోందని; అంతటి సద్గురువు వద్ద శిష్యరికం చేసే మహద్భాగ్యాన్ని కలిగించిన ఆ 'సర్వేశ్వరునికి' శతసహస్ర వందనాలర్పిస్తున్నాని .. పార్ధసారధి గురువులైన నేతివారిని తలచుకున్నారు.

శర్మగారి సీనియర్ శిష్యురాలు, చైర్పర్సన్ ఆంధ్ర మహిళా సభ ఫైన్ ఆర్ట్స్, (హైదరాబాద్) డాక్టర్ వై. రమాప్రభ గారు తమ గురువులను తలచుకుంటూ "పారుపల్లి వారి ఆశయాలను నూటికి నూరుపాళ్ళు అమలుపరచి సంగీతాన్ని ఆనందింపచేస్తూ బోధన చేసిన సద్గురువులని; పిళ్ళారి గీతం పాడినా, రామదాసు కీర్తన పాడినా నవ్వుతూ శిష్యులకు వారే వయొలిన్ సహకారాన్ని అందించిన మహనీయులని, ఈ విషయాన్నీ జ్ఞాపకం చేసుకుంటే ఎవరికైనా కళ్ళు చెమర్చక మానవని" గుర్తుచేసుకొన్నారు. గురువుగారిలో అద్భుతమైన గుణము ఒకటుందని, ఎవరైనా పెద్ద పెద్ద విద్వాంసులు సర్వశ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, అన్నవరపు రామస్వామి, మహాదేవు రాధాకృష్ణరాజు, నూకల చిన సత్యనారాయణ, ఎన్. ఎస్. శ్రీనివాసన్, శ్రీరంగం గోపాలరత్నం, జయలక్ష్మి సంతానం, మాలతీ పద్మనాభరావు, పాకాల సావిత్రి, ఎల్లా వెంకటేశ్వరరావు, కొక్కొండ సుబ్రహ్మణ్య శర్మ, ఆకెళ్ళ మల్లికార్జున శర్మ ప్రభృతులు గురువుల ఇంటికి వచ్చినప్పుడు ఆ సమయంలో పాఠం నేర్చుకుంటున్న శిష్యగణాన్ని పరిచయము చేస్తుంటే శిష్యులము మహాద్భాగ్యంగా భావించే వారమని; సభా నిర్వాకులు సర్వశ్రీ కొణికి సత్యనారాయణ, వి. ముక్తేశ్వరరావు లాంటి పెద్దలు గురువుల ఇంటికి వచ్చినప్పుడు శిష్యులను పరిచయం చేసి వీళ్ళు చక్కగా పాడతారు ముందు ఒక గంట అవకాశం ఇచ్చి చూడమనేవారని, ఇటువంటి విశాలహృదయం గల గురువులు దొరుకుట చాలా అరుదు మరియు మా అదృష్టమని కూడా అంటారు. మా గురువులు వేసిన ఆ బీజాలే మొలకెత్తి, మొక్కలై, వృక్షాలై శాఖోపశాఖులుగా విస్తరించి సంగీతానికి కొద్దో గొప్పో సేవచేసే భాగ్యం మాకు దక్కిందని, గురువులకు 2000 సం. లో శిష్యగణమంతా డాక్టర్ బాలమురళీకృష్ణ గారి ఆధ్వర్యంలో జరిపిన సువర్ణఘంటా కంకణ – కనకాభిషేక మహోత్సవము, 'సంగీతానంద' బిరుదు ప్రదానము హైదరాబాదు నగరంలో నభూతొ న భవిష్యతియని, గురువుల ఆసిస్సులు మాకు ఎల్లయెడల ఉండాలని ఆశిస్తున్నామని అన్నారు.

దేశము నలుమూలలలోని పలు సంగీత సభలవారు శ్రీరామశర్మ గారిని ఆహ్వానించారు మరియు ఘన సన్మానాలు, సత్కారాలు చేసి ఆదరించారు. వారిని సన్మానించిన కొన్ని ప్రతిష్ఠాత్మకమైన సభలు, సంస్థలు -- 1970 లో కలకత్తా ఆంధ్ర సంఘం, కలకత్తా; కళారాజ్యం (రిజి.), హైదరాబాదు; శ్రీ తూము నరసింహదాసు ట్రస్ట్, హైదరాబాదు; శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాదు; విజ్ఞాన సమితి, హైదరాబాదు; కిన్నెర ఆర్ట్స్, హైదరాబాద్; కూచిపూడి ఆర్ట్స్ అకాడెమి ; వైష్ణవి అకాడమీ అఫ్ ఫైన్ ఆర్ట్స్; 2005 సంవత్సరానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ వారిచే 'ప్రతిభా పురస్కారం'; 2007 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే 'ప్రతిభా రాజీవ్ పురస్కారం'; 2010 సంవత్సరం లో 'శ్రీ కృష్ణమాచార్య కళాపీఠం' , విజయవాడ; 2010 లో విశాఖ మ్యూజిక్ అకాడెమి వారిచే 'ద్వారం వెంకటస్వామి నాయుడు' గారి స్మారక పురస్కారం.

అనేక సంగీత సభలకు భూరి విరాళములందించి కచేరీలు నిర్వహించటానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వడంతోపాటు వారే స్వయంగా తమ గురువులు శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి పేరిట 1997లో సంస్థను స్థాపించి జీవిత చరమాంకం వరకు ప్రతీ సంవత్సరం కచేరీలు నిర్వహించి ఎంతోమంది శిష్యులకు అందులో పాల్గొనే అవకాశం కల్పించారు. హైదరాబాదు మహానగరంలో ఏ సంగీత కళాకారుడైన శ్రీరామశర్మ మాస్టారు గారి శిష్యులో, ప్రశిష్యులో అయిఉంటారనటంలో అతిశయోక్తిలేదు.

సుమారు మూడు దశాబ్దములకు పైగా హైదరాబాదు ఆకాశవాణిలో నిలయ విద్వాంసునిగా సేవలందించి, 1988లో సీనియర్ నిలయ విద్వాంసునిగా పదవీవిరమణ చేసి, స్థానికంగా స్థిరనివాసం ఏర్పరుచుకుని ఆరుగురు సంతానానికి వివాహములు చేసి జీవితంలో స్థిరపడి, సంగీతమే తన ఊపిరిగా, జీవన పరమార్గంగా, సర్వస్వముగా భావించి జీవన ప్రయాణం చేసి, ఎంతోమంది శిష్యగణాన్ని తయారుచేసి వారిని ఉత్తములుగా వృద్ధిలోకి తీసుకువచ్చి తరించిన ధన్యజీవి 'సంగీతానంద' శ్రీ నేతి శ్రీరామశర్మ గారు వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినాన (తేదీ: మే 2, 2012) శ్రీరామసాయుజ్యానికి చేరి సంగీతాభిమానులందరి మనస్సులలో 'చిరస్మరణీయుడు' గా నిలిచిన మహర్షి.

గురువుల నిర్యాణం పిదప జరిపిన గురుసంస్మరణ సభ సందర్భాన 2012లో శిష్య ప్రశిష్య బృందం సుప్రసిద్ధ వాయులీన విద్వాంసురాలు కుమారి A. కన్యాకుమారి గారిని సన్మానించగా; తరువాతి కాలంలో 2013 నుండి ఆంధ్ర మహిళా సభ ఫైన్ ఆర్ట్స్ వారి సౌజన్యంతో, ప్రత్యేకించి శిష్య పరమాణువు పి. రమేష్ మరియు ఇతరులు ఏర్పరచిన

మూలనిధితో శిష్యగణం గురువుల జయంతిని 'గురుస్మరణం' పేరిట ప్రతీ సంవత్సరం నిర్విఘ్నముగా జరిపి ఒక ప్రముఖ సంగీత విద్వాంసుని ఘనంగా సన్మానిస్తూ ఉండటం ఎంతో ముదావహం, హర్షణీయం. 2023 సంవత్సరానికి గాను పద్మశ్రీ శ్రీ అన్నవరపు రామస్వామి గారిని ఘనంగా సన్మానించారు.

★★★